# సాన్నిహిత్యం

దూరి వెంకటరావు

మిట్ట మధ్యాహ్నం- ఎండ చుర్రుమంటోంది.

భోంచేసి భుక్తాయాసం తీర్చుకుందామని వరండాలోకొచ్చాను.

''పోస్ట్'' అంటూ వీధి గుమ్మంలోంచే ఓ ఇన్‌లాండ్ లెటరు విసిరేసి వెళ్ళిపోయాడు పోస్టుమాను.

ఆత్రంగా కవరు తీసాను.

''ఎక్కడనుంచండి ఆ ఉత్తరం? బెంగుళూరునుండేనా? అబ్బాయి ఏం రాశాడు?'' అంటూ దగ్గరకొచ్చింది అనూరాధ.

'నన్ను చూడనిస్తావా' అన్నట్లు చిరాగ్గా ముఖంపెట్టి కవరు చించాను.

మరి మాట్లాడలేదు అనూరాధ.

''నాన్నగారికి! నమస్కారాలు-

మేం ఇక్కడ క్షేమంగా ఉన్నాం. అక్కడ మీరంతా క్షేమమనే తలుస్తాను. మనూళ్ళో ఉంటున్న గంగాధరంగారు, మా ఎమ్.డి.గారు బాగా సన్నిహితులని ఇప్పుడే తెలిసింది. మీకు ఆయన సుపరిచితులే కాబట్టి మీరతనితో ఒక ముక్క చెబితేచాలు నాకు అక్కడికి సునాయాసంగా ట్రాన్స్‌ఫరయిపోతుంది. ఇక మీదే ఆలస్యం. శృతి మిమ్మల్ని అందరినీ అడిగినట్లు వ్రాయమంది. చిరంజీవులు సుశీల్, సుమిత్ర తాతగారి దగ్గరకు ఎప్పుడు వెళతాం అంటూ తెగ కలవరిస్తున్నారు.

ఇట్లు మీ,<br>సుధాకర్.

ఉత్తరాన్ని బయటకు చదివాను.

''ఇంకా ఏమిటి ఆలోచిస్తున్నారు? వెంటనే గంగాధరం గారితో మాట్లాడండి. వెర్రినాగన్న చిన్నప్పుడు నన్ను విడిచి క్షణం ఉండేవాడు కాదు. ఇప్పుడెలా ఉంటున్నాడో ఏమిటో! మనవల్ని ఎత్తుకు తిప్పుదామని ముచ్చటపడి వాడికి పెళ్లి కూడ చేసాను. ప్చ్... ఏం లాభం? కోడలిపిల్ల కాలి పారాయణ ఆరక ముందే వాడికి బదిలీ అయిపోయింది. ఉత్తరాలలో ఊసులాడుకోవడం తప్ప పిల్లల్ని దగ్గరకు తీసుకునే యోగం నాకు లేదు.'' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనూరాధ.

బిడ్డపట్ల ఆ తల్లికున్న మమకారం అటువంటిది. అయితే ఆరాటమంతా ఆమెదేనా? నాకు మాత్రం లేదా? ఉద్యోగరీత్యా ఏర్పడ్డ ఎడబాటుకు ఎవరేం చేయగలరని సరిపెట్టుకున్నానేగాని వాడిని విడిచి నేను మాత్రం ఉండగలనా? వాడి బదిలీ కోసం నేనెన్ని విధాల ప్రయత్నించలేదు? కాలం కలిసి రాకగాని... ఇవాళే గంగాధరంగార్ని కలుస్తాను. ఆయనతో నాకున్న పరిచయం అంతంతమాత్రమే అయినా నామీద అతడికి అపారమైన గౌరవం ఉంది. వాళ్ళ మనవడిని టెన్త్ ఫస్టుక్లాసులో పాస్ చేయించేందుకు నేనెంత కష్టపడ్డాను? కనీసం ఆ కృతజ్ఞతతోనైనా నాకు సహాయపడక మానడు.

''ఇంకా ఏమిటా పరధ్యానం. బయల్దేరండి'' నా ఆలోచనలకు అడ్డు తగులుతూ కర్తవ్యాన్ని గుర్తు చేసింది అనూరాధ.

''నీ తొందర నీదేగాని సమయం సందర్భం ఉండొద్దూ? ఎండ మండిపోతోంది. ఇప్పుడాయన పడుకుంటాడు. ఈవేళప్పుడు వెళ్ళి అతణ్ణి ఇబ్బంది పెట్టేకంటే కాస్త చల్లబడ్డాక వెళితే బావుంటుంది.'' అన్నాను ఉత్తరాన్ని మడుస్తూ.

నా మాటకు ఏమనుకుందో ఏమో మరి కిమ్మన లేదు.

సాయంత్రం ఐదవుతూవుండగా స్నానం చేసి ఇస్త్రీ బట్టలు తొడుక్కుని గంగాధరం గారింటికి బయలుదేరాను.

త్రోవలో ముకుందం ఎదురయ్యాడు.

మాది చిన్ననాటి స్నేహమే అయినా ఇప్పుడు వాడిని పలకరించబుద్ధి కాలేదు. కారణం 'ఎక్కడికి' అని అడుగుతాడేమో నన్న సెంటిమెంటు. అందుకే ముఖం ప్రక్కకు తిప్పుకున్నాను. అయినా వాడు నన్ను విడిచిపెట్టలేదు. ''ఒరేయ్ గోవిందం!'' అంటూ దగ్గరకొచ్చాడు.

విధిలేక అతణ్ణి చూసి పళ్ళు ఇకిలించాను.

''పోయిందిరా గోవిందం నాపరువంతా గంగలో కలిసిపోయింది'' అంటూ చంటిపిల్లాడిలా కంటతడి పెట్టాడు ముకుందం.

విషయం తెలియకున్నా వాడి మాటలు వింటుంటే జాలేసింది. ''ఇలా కూర్చో నీకొచ్చిన కష్టమేమిటో వివరంగా చెప్పు'' అంటూ ప్రక్కనేవున్న మదుం మీద చతికిలబడ్డాను.

''అర్జంటుగా నువ్వు నాకేదైనా పని చూసిపెట్టాలి'' అర్థింపుగా అన్నాడు ముకుందం.

''కొడుకు, కోడలు సంపాదిస్తున్నది చాలదా!'' అన్నాను వాడి అభ్యర్థనకు విస్తుపోయి నవ్వుతూ.

నామాటకు వాడు హర్టయినట్లుంది. మౌనంగా ఉండిపోయాడు. వాడిని చూస్తే బాధనిపించింది. అనవసరంగా తొందరపడి మాట పారేసుకున్నానేమో అనిపించింది. కాస్సేపు మా మధ్య మాటల్లేవు.

''పరువు పోయిందంటున్నావ్. అసలు జరిగిందేమిటో చెప్పావుకాదు. ఉన్నపళంగా నీకీవయసులో ఉద్యోగం చేయవలసిన కర్మ ఏం వచ్చింది?'' అంటూ మెల్లగా అతడిని సంభాషణలోకి దింపాను.

నోరు విప్పాడు ముకుందం.

• • •

మొదటి నుండి ముకుందం కష్టజీవి. సరైన ఉద్యోగమేదీ లేకపోవడంవల్ల సంసారాన్ని నెట్టుకు రావడం కోసం నానా తిప్పలు పడేవాడు.

వాడు చెయ్యని పనిలేదు.

రెండుపూటలా డయిరీ పాలు అమ్మడం.

అవసరమైన వాళ్ళకు ఇన్సూరెన్సు పాలసీలు ఇప్పించడం, చవక దుకాణాలలో సరుకులు తూచివ్వడం.

-ఇలా ఎన్ని పనులు చేస్తున్నా అతడి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండేది. ఆ కారణంగా కొడుకును చదివించడం కోసం కూతుర్ని బడి మాన్పించేసాడు. కట్నమిచ్చుకోలేక ఆ పిల్లని రెండోపెళ్లివాడికిచ్చి ముడివేశాడు. పెళ్ళైన నాలుగేళ్ళకే అదృష్టం ఆమెను వెక్కిరించింది. అయిదోతనం పోగొట్టుకుని ఇద్దరు పిల్లలతో పుట్టింటికి చేరింది. రమణి అంటే రాజుకు అపరిమితమైన ప్రేమ. కాలం కలిసిరావడం వల్ల చదువవుతూనే బిలాయి స్టీలుప్లాంట్‌లో ఉద్యోగమయింది. మరుచటేడే తను వలచిన వనితతో వివాహం కూడ అయిపోయింది. నెల నెలా కొడుకు అంతో ఇంతో పంపిస్తుండటంతో ముకుందం ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కాయి. వయసు పైబడటంతో మరి తిరిగే వోపిక లేక ఇంటివద్దే ఉండిపోతున్నాడు. అయినా రాజులా రోజులు గడిపేస్తున్నాడు. సెలవు మీద రాజు ఎప్పుడు ఇంటికొచ్చినా కన్నవాళ్ళకి కొత్త బట్టలు, రమణికి మంచి చీరలు, మేనల్లుళ్ళకు రకరకాల ఆటవస్తువులు పట్టుకొచ్చేవాడు. ఇలా ఉండగా విశాఖ ఉక్కుఫ్యాక్టరీలో అదనపు సిబ్బంది అవసరమవడంతో రాజు బిలాయి నుంచి విశాఖపట్నం వచ్చేస్తాడు. బిడ్డ ఇక ఎప్పుడూ తమతోనే ఉంటాడని తెలిసి తెగ సంబరపడిపోయారు ముకుందం దంప

తులు. రమణి సంగతి సరేసరి. తమ్ముడు తనని, తన పిల్లల్ని మరింత అపురూపంగా చూసుకుంటాడని మురిసిపోయింది.

ఒక సంవత్సరం ఏ ఒడిదుడుకులు లేకుండా హాయిగా సాగిపోయింది. ఆ తర్వాత మొదలయ్యాయి మనస్పర్థలు. తన భర్త సంపాదనతోపాటు తన ఆర్జన కూడ ఆ ఇంటి అవసరాలకు హారతి కర్పూరం కావడాన్ని వాణి జీర్ణించుకోలేకపోయింది. అంతే, అప్పటి నుండి ఆమె కొన్ని షరతులు విధించింది.

వాటిల్లో మొదటిది పొదుపు. ఆ మేరకు ప్రప్రథమంగా పనిమనిషికి ఉద్వాసన పలికింది. ఫలితంగా పాచిపనులతోపాటు ఇంటి పనులన్నీ రమణే చేయవలసి వచ్చేది. అదేవిట్రా అని ఎవరైనా అంటే ''సంసార శ్రేయస్సు దృష్ట్యా నా భార్య కొన్ని పొదుపు నియమాల్ని పాటించాలంటోంది. అందులో తప్పేముంది?'' అంటూ ఇల్లాలిని సమర్థించేవాడు. రాను రాను ఆమె చర్యలు శృతిమించుతున్నా ఊ.. ఆ.. అనలేకపోయేవాడు.

ఒక రోజు రాజు పడగ్గదిలో వాణిని దగ్గరకు తీసుకున్నప్పుడు ''రమణికి తిండి పెట్టడమే శుద్ధ దండగ అనుకుంటూ వుంటే ఆవిడగారి పిల్లలకు కాన్వెంటు చదువులు కూడానా? ఏం మునిసిపల్ బడిలో చదవలేరా?'' అని అడిగింది పెనిమిటి గుండెల మీద వాలిపోతూ. భార్య మాటలు కాస్త ఇబ్బంది కలిగించినా తమాయించుకుంటూ ''ఎందుకు చదవలేరు? నేనెక్కడ చదివి ఇంతవాడినయ్యాను'' అన్నాడు.

మరునాడే వాణి మాట రాజశాసనమైంది.

ముకుందం మనసు మౌనంగా రోదించింది.

ఆ ఏడు సంక్రాంతికి ఇంటిల్లిపాదికి బట్టలు తీసే బాధ్యత తన నెత్తినేసుకుంది వాణి. తన భర్త పిల్లలకు నాణ్యమైన డ్రెస్సులు తీసి, మిగిలినవాళ్ళకు నాసిరకం వలువలు పట్టుకురావడం చూసి చలించిపోయాడు ముకుందం. పైకి ఏమనలేక లోలోన బాధపడ్డాడు. వయసు పైబడినవాళ్ళకి ఆలోచనలు తోడైతే బి.పి. ఎక్కువవుతుందంటారు. ముకుందం విషయంలో అది అక్షరాలా ఋజువైంది.

• • •

''కూర్చుని తింటే కొండలైనా తరిగిపోతాయి. అందుచేత మీనాన్నని ఎక్కడైనా పనిచేసి కనీసం తన మందులకు సరిపడ డబ్బులైనా సంపాదించమని చెప్పండి. మీకాముక్క చెప్పడానికి ధైర్యం లేకపోతే మరోచోటికి మకామైనా మార్చండి'' అంటూ ఇవాళ మా కోడలు కరాఖండీగా చెప్పేసిందిరా'' అన్నాడు చెమర్చిన కళ్ళను వత్తుకుంటూ.

''అబ్బాయి ఏమన్నాడు?'' అడిగాను ఆత్రంగా.

''ఈ వయసులో నాన్న ఏంపని చేస్తాడు?'' అన్నాడు వాడు.

''ఏ వయసులోనైనా ఏదో ఒక వ్యాపకం ఉంటేనే ఆరోగ్యం'' అన్నది కోడలు.

''ఏమిటోరా దూరంగా ఉన్నప్పుడే మామధ్య ఆప్యాయతలు, అభిమానాలు మెండుగా ఉండేవి. ప్రతి నెల డబ్బు పంపడమే కాదు ఆత్మీయంగా ఉత్తరాలు కూడ రాసేవాడు. ఎప్పుడు ఊరునుంచి వచ్చినా ప్రేమగా ఎవరికి ఏం కావాలో అడిగి కొనిపెట్టేవాడు. దగ్గరకొచ్చాకా అవన్నీ నీరులా ఆవిరై మాయమైపోయాయి. కోడలుపిల్ల ఇప్పటికే ఇంటి అన్వేషణలో ఉన్నట్లు తెలిసింది. ఉన్న ఊళ్ళో కొడుకు కోడలు వేరు కాపరం పెడితే నా పరువు ఏం కావాలి? అందుకే ఆమె కోరిక మేరకు ఏదైనా పని చెయ్యాలని నిర్ణయించుకున్నాను. క్షమించు నువ్వు ఎక్కడికో పని మీద వెళుతున్నట్లున్నావ్. బలవంతంగా ఆపి మరీ నీ బుర్ర తినేసాను'' అంటూ లేచాడు ముకుందం.

వాడి మాటలేవీ నాకు వినిపించడంలేదు. పరధ్యానంగా గంగాధరం గారింటికి బయలుదేరాను. నా కొడుక్కి ట్రాన్స్‌ఫర్ చేయించమని అడిగేందుకు కాదు. ముకుందానికి ఏదైనా ఉద్యోగం చూసిపెట్టమని అర్థించడానికి.

★

